

# విరామం

## – అంగర వేంకట కృష్ణారావు



*1939 నుంచి 45 వరకూ జరిగిన రెండో ప్రపంచ మహాయుద్ధం మానవ జాతి మనుగడలో ఒక బృహత్తర ఘట్టం. ఈ సమరంలో రాజ్యాలు చూస్తూండగా పేక మేడల్లా కూలిపోయేయి. మహానగరాలు తిరగట్లో పప్పులా పిండైపోయేయి. మనుషులు కుంపట్లో పడ్డ చీమల్లా మాడిపోయేరు. ఆ విధ్వంసకాండ అభూతం! వర్ణనాతీతం.*

*పోతే, యిక మరి యుద్ధం వద్దనిపించిందా? మరి హింస వద్దు అనిపించిందా? ఉహుఁ యుద్ధమన్నా, హింసన్నా, జంకుపోయిందేమో...యుద్ధమే యెల్లప్పుడూ సాగేది. శాంతి ఒక "విరామం" లాంటిది.*

*ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రికలో ధారావాహికంగా వెలువడ్డ ఈ నవల్లో అడుగడుగునా "నేను" వున్నా ఇది కేవలం నా వూహ కాదు. ఈ ప్రదేశాలు నా కళ్ళతో చూసినవి. అయితే, రచనకి కల్పన అవసరం. ఇందులో కల్పన 'అంత మాత్రమే' వుంది.*

అంగర వెంకట కృష్ణారావు

*ఒక చిన్న మాట!*

*ఇటీవల తెలుగులో వస్తున్న నవలలన్నీ అపౌరుషేయాలు. భబానీ భట్టాచార్య బెంగాల్ క్షామం గురించి వ్రాసిన 'సోమెనీ హంగర్స్' తో తులతూగ గల మొట్టమొదటియుద్ధ దుష్ఫలితాల నభివ్యక్తం చేసే నవల తెలుగులో 'విరామం' అంటే ఎవరూ ఆశ్చర్యపోనక్కరలేదు. సాంస్కృతిక జీవనం పూర్తిగా స్తంభించిపోయి, అన్ని కళలూ, శాస్త్రాలూ, సర్వమూ సినిమాకు, రాజకీయాలకూ దాస్యం చేస్తున్న ఈ రోజులలో, శక్తిమంతమైన రచనలు రావటానికి ఉన్న అవకాశాలు దాదాపు మృగ్యం. సాహిత్యంలో వచ్చే కొత్త పోకడలను పసికట్టి, ఆదరించి ప్రోత్సహించే స్థితిలో పత్రికలు, ప్రచురణకర్తలు లేకపోయినట్లయితే, ఇక ఆ దేశపు దౌర్భాగ్యం గురించి చెప్పనవసరం లేదు. మనుష్యులలో ఏ ఒక జాతిపట్లనైనా ద్వేషం ప్రకటించడం యావత్తు మానవజాతినీ ద్వేషించడం కాగలదనే జ్ఞానం కూడా లేని రచయితలున్న మన దేశంలో, సాహిత్యం కాలక్షేపానికి తప్ప మరెందుకూ పనికి రాదేమో...ఈ పై సందేహాలన్నిటికీ నివృత్తి 'విరామం' నవల. అందుచేత తెలుగు నవలా సాహిత్యంలో శ్రీ అంగర వెంకట కృష్ణారావుగారి 'విరామం' ఒక కొత్త మలుపు. బెంగాలీలో భబానీ భట్టాచార్య, బిభూతి భూషణ బందోపాధ్యాయ, మానిక్ బందోపాధ్యాయ, మలయాళంలో తక్కాళి శివశంకర పిళ్లై, తమిళంలో ఆర్.కె.నారాయణ్, కానా శివసుబ్రహ్మణ్యం వంటి రచయితల కోవలోకి చేరుతారుతెలుగులో చాసో, కె.కె., రా.వి. శాస్త్రి, అంగర వెంకట కృష్ణారావు, కాళీపట్నం రామారావులు.ఇతివృత్తం, భాష, శైలి శిల్పం, పాత్ర పోషణతో సహా అన్నింట్లోనూ 'విరామం' భారతీయ భాషలలో వచ్చే ఏ ఉత్తమ నవలకు తీసిపోదని నవినయంగా మనవి చేసుకుంటున్నాను.*

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

విజయవాడ, 24-1-1970

*(గత సంచిక తరువాయి)*

"**అక్కకి గర్భస్రావం** కలగడానికి చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయ్యేయి. ఏడో నెలలో నాన్నగారు చనిపోయేరు. మేమంతా యిక్కడికొచ్చే సేం...

"అక్క ఆస్పత్రిలో పురుడైంది. అసలే మతిలేని మనిషి. అందులో పురుడు కష్టమైంది. పెద్ద ప్రాణానికి నష్టమొస్తుందని జడిసి ఆపరేషను చేసి బిడ్డను తీశారు. బిడ్డకి ప్రాణం లేదు. అక్కకి మతిలేదు...

"పెదనాన్నగారావిణ్ణి సీతాకుండీలో వుంచేరు. అది మామూలు పల్లె, గాలి మంచిది. అదీ అక్క సంగతి."

పద్మ కథ విని నా వళ్ళు నీరు విడిచిపోయింది. ఆ పిల్ల మనసు గాజుకుప్పెలా నాజూకైనది. రాక్షసుడు ఫిష్ పూల్ చేసిన దురంతానికి బలైపోయింది.

తండ్రి గతించినా, అక్కకి మతిపోయినా, సంసారం అవమానం పాలైనా, స్థానభ్రష్టత్వం కలిగినా, పాపం చిన్నది ఉమ దైర్యం కూడ గట్టుకుని, యింటికి పెద్దదై, సంసారం బరువు తలమీద పెట్టుకుంది.

పరిస్థితుల ప్రభావం మహాచెడ్డది. దాని దాడికి ఒక వ్యక్తే కాదు, దేశమే కాదు, ఒకొక్కప్పుడు ప్రపంచమే తల వొగ్గాలి.

మర్నాడు సాయంత్రం నా స్నేహితులు కొందరు భోజనానికొస్తున్నారని, భోజనం యేర్పాటు చెయ్యమని లహరీతో చెప్పా. లహరీ మంచి ఏర్పాట్లు చేసేడు. కాని ఎవరొస్తున్నారో అతనికి తెలీదు. ఏరియా ఆఫీసు నించొస్తున్నారని మాత్రం చెప్పా.

ఆరున్నరకి ఉమ, చెల్లెళ్ళు వచ్చేరు. వాళ్ళని చూసి లహరీ ఆశ్చర్యపోయేడు. వాళ్ళని డైనింగు రూములోకి తీసుకెళ్ళా.

"మిస్ ఉమ! ఇతను నా స్నేహితుడు బైద్యనాథ్ లహరి. లహరీ! ఈమె మా ఆఫీసు టైపిస్టు మిస్ ఉమ" అని పరిచయం చేశా. ఉమ "నమష్కార్" అంది. లహరీ బొమ్మలా నిలబడిపోయేడు.

చికో మాతో కలసి భోంచేసేడు. లహరీకి పద్మ సంగతి అప్పుడే తొలిసారి చెప్పా. ఫిష్ పూల్ జరిపిన అత్యాచారం మాత్రం చెప్పలేదు. తండ్రికి జబ్బుచెయ్యడం వల్ల వుద్యోగం మానేసిందని, అతని మరణం ఆమె మనసుని తీవ్రంగా గాయపరిచిందని చెప్పా.

పద్మని చూడ్డానికి పై ఆదివారం అంతా కలిసి సీతాకుండీ వెళ్ళడానికి నిశ్చయించేం.

లహరీ ఉమని చెల్లెళ్ళనీ వాళ్ళింటికి దిగబెట్టి వచ్చేడు.

"లహరీ! నువ్వు ఉమని ప్రేమిస్తున్నావా?"

"ఔను..."

"పెళ్ళి చేసుకుంటావా?"

“ఔను...”

“బాగా ఆలోచించు. నీకు అన్నలున్నారు. వదినలున్నారు. ఎన్నో అడ్డంకులు రావచ్చు."

“లేదు జమేదార్ సాబ్! నేను ఉమని తప్పకుండా వివాహమాడతా. నేనామెని గాఢంగా ప్రేమిస్తున్నా.”

అప్పుడు లహరీకి పద్మ అసలు సంగతి చెప్పా. లహరీ దిమ్మెరపోయేడు.

“కమల్ ఎక్కడున్నాడు....”

“ఢాకాలో బేస్ ఆస్పత్రిలో సివిలియను క్లార్కుగా వున్నాడు.”

"అతనొస్తే పద్మకి నయమౌతుందేమో...”

“బహుశా. రేపుత్తరం రాస్తా పై ఆదివారం రమ్మని. మనం సీతాకుండీ వెళదాం.”

“ఇప్పుడతను బైటపడొచ్చా...”

“బైట పడొచ్చా అంటే, పడొచ్చు. యుద్ధం ముగిసింది. పోలీసులు పాత కేసుల్నంత పట్టించుకోకపోవచ్చు. ఇంతకీ అతని మీద పోలీసు కేసు ఉందో లేదో తెలీదు. అనుమానం కొద్దీ పరారీ అయిపోయేడు. కాని ఈ అహుజా కేసుంటుంది. అందులో కూడా అతని మీద ఛార్జీలున్నాయో లేవో. వారంటు జారీ చేశారో లేదో. పోతే, మిలిట్రీలోంచి పరారీ అయిన కేసుమాత్రం తప్పకుండా వుంటుంది. అతను ఏ యెడ్రసిచ్చేడో ఆ జిల్లా పోలీసు సూపర్నెంటు పేర రిపోర్టు వెళుతుంది. అతనే తప్పు అడ్రసిచ్చేడు. ఇంతకీ యుద్ధం అయిపోయింది. పరారీ కేసులు బుట్ట దాఖలా అయిపోతాయి. కాని నువ్వు ఉమని మోసంజేస్తే, అసలే కుంగిపోయిన వాళ్ళ సంసారం మీద మరో దెబ్బ కొట్టినవాడివవుతావు....”

“లేదు లేదు. ప్రమాణంచేసి చెప్తున్నా. ఉమ నాది, నేను ఉమ వాణ్ణి".

“సరే..."

మర్నాడు సాయంత్రం సేన్ యింటికి వెళ్ళా. సీనియర్ సేన్ తో పద్మ, ఉమల సంగతంతా చెప్పా. ముసలాయన వోపిగ్గా అంతా విన్నాడు.

“'పద్మ కమల్ కలిస్తే, కలసి కొన్ని రోజులుంటే, పద్మ మళ్ళీ మనిషవుతుందని నా నమ్మకం...”

“పద్మని కమల్ ఈ పరిస్థితిలో వివాహమాడతాడా?”

“తప్పకుండా – ఆమెకోసం అతను తపించిపోతున్నాడు.

“పై ఆదివారం అతనొస్తాడు. నేను, అతను, లహరీ మీ యింటికొస్తాం. మనం అంతా కలిసి సీతాకుండీ వెళదాం. కమల్ ని చూస్తే పద్మలో కొంత మార్పొస్తుందని నా అంతరాత్మ చెపుతూంది. మీరు కాస్త దీనికి పూనుకోవాలి...” నేను ప్రాధేయంగా అన్నా.

"మైడియర్ జమేదార్ సాబ్! వీళ్ళంతా నా వాళ్లు. నువ్వింతలా చెప్పాలా. నా శాయశక్తులా పాటుపడి ఈ రెండు వివాహాలు చేయిస్తా..."

"వీళ్ళంతా మీ వాళ్ళే... నిజమే. కాని నా వాళ్ళు కూడా... " గొంతు బొంగురుపోయి అన్నాను....

"తెలుసు, నాకు తెలుసు, మనం అంతా ఒక కుటుంబం..."

నా మనసు తేలికపడింది.

22

కల్నల్ జేమ్సుకి కలకత్తా బ్రిగేడాఫీసుకు బదిలీ అయిపోయింది. శనివారం టెలిగ్రామొచ్చింది, ఏరియా ఆఫీసు సంతోషంలో మునిగి తేలింది. అంతా తృప్తిగా నిట్టూర్చేరు. కల్నలు సోమవారం బ్రిగేడాఫీసులో చేరాలి. ఒంటిగంటకి అందరితో కరచాలనం చేసేడు. నాతో చేస్తూ "జమేదార్ సాబ్! త్వరలో కలుద్దాం" అన్నాడు. కలియడం, విడిపోడం మామూలే గనక అతని మాటల్లో అంతరార్థం గ్రహించడానికి నేను యత్నించలేదు. కానీ కెప్టెన్ న్యూసన్ మొదలైన వాళ్ళు దాన్ని గురించి కొంత చర్చించేరు.

మంగళవారం ఎయిర్ మెయిల్ లో నాకూ తాఖీదొచ్చింది. నన్ను కూడా బ్రిగేడ్ హెడ్ క్వార్టర్సుకి బదలాయించేరు. నేను శనివారం నాడక్కడ హాజరుకావాలి. వ్యవధి లేదు. వెంటనే ప్రయాణం.

ఉమ ఆఫీసులో యేడ్చింది. నేనామెనోదార్చా : పెద్ద సేన్ గారితో చెప్పినదంతా చెప్పా.

నా బదిలీ సంగతి విని లహరీకి మూర్ఛవచ్చినంతపనయింది. లహరీ నన్నొక స్వంత అన్నలా చూసుకుంటున్నాడు. అతను నా దగ్గర కొచ్చినప్పుడు సిపాయి. వృత్తిలో మూడో గ్రేడు. క్రమంగా అతన్ని నాతో సమానం చేశా. మొదటి గ్రేడుకి ఎత్తా. నాకు ప్రొమోషనొచ్చి నప్పుడు సంతోషం పట్టలేక లహరీ ముందుకి వెనక్కి పదిసార్లు మార్చిచేసి పదిసార్లు సెల్యూట్ చేశాడు.

"లహరీ! యెల్లుండి కలకత్తా బైల్దేరుతున్నా. కమల్ వస్తాడు. నువ్వతన్ని సేన్ గారి దగ్గరికి తీసుకెళ్ళు. మీరంతా సీతాకుండీ వెళ్ళండి. నేను తిరిగి పద్మానది దాటి యిటు రాననుకుంటా. మనం తిరిగి ఈ సర్వీసులో కాదు, ఈ జీవితంలోనే కలియమేమో. అసలు మనదేశ పరిస్థితే మారిపోవచ్చు. భారం అంతా నీది. నువ్వు ఉమని దగాచేయకు. కమల్ పద్మ సుఖంగా వుండాలి. అదే నా కోరిక..."

ఉద్రేకంతో అతని మొహం బిగుసుకు పోయింది. లహరీ నాతో స్టేషనుకొచ్చాడు. ఒద్దంటున్నా ఉమ కూడా వచ్చింది.. 'మనసుల్లో 'బాధ చేత మేమేం మాట్లాడుకోలేకపోయాం. ఉమ ఉండుండి కన్నీళ్ళు పెట్టుకుంటోంది.

రైలొచ్చింది. నా సామాన్లు కంపార్టు మెంటులో పెట్టాం.

గార్డు విజిలూదేడు. గంట మోగింది, రైలు కూసింది.

“ఓకే, లహరీ!" అని చేతులు జాపా.

లహరీ నా గుండెలకి హత్తుకుపోయేడు. ఇద్దరం శాశ్వతంగా విడిపోతున్నందుకు చంటి పిల్లల్లా యేడిచాం. ఉమ మొహం అటు తిప్పుకుంది.

రైలు వెళ్ళిపోతుంది. నేను గుమ్మంలోంచి వంగి "లహరీ! మర్చిపోకు” అన్నా. అతనలాగే అన్నట్టు తలూ పేడు. వాళ్ళిద్దరూ కనిపించే వరకూ చూస్తున్నా.

పద్మానది మీంచి లాంచి వెళ్ళిపోతూంది. ఆవాళ పౌర్ణిమ.

అన్నీ తెలిసిన పద్మ చంటిపిల్లలా వెల్లకిలా వెన్నెల్లో పడుకుని చంద్రుడివేపు చూస్తూ ఏమీ తెలియని దానిలా నవ్వుతూంది.

*(సమాప్తం)*